# చేనేత కార్మిక సోదర సోదరీమణుల ఆదాయ పెంపు గురించి కొన్ని ఆలోచనలు...





సంజయ్ కుమార్ పాండ, IAS

# చేనేత కార్మిక సోదర సోదరీమణుల ఆదాయ పెంపు గురించి కొన్ని ఆలోచనలు...





సంజయ్ కుమార్ పాండ, IAS


"మూల మంత్రం"

చేనేత అభివృద్ధి ఒక ఆరాధన. ఈ ఆరాధనలో వినియోగదారుడు ఒక దేవుడు. మార్కెట్ ఒక స్వర్గం. ఈ ఆరాధనలో పాటించాల్సిన ప్రాథమిక సూత్రం, మార్కెట్ అవసరాల కనుగుణంగా వస్త్ర ఉత్పత్తి చేయడం. గాయత్రీ మంత్రం లాంటి మూల మంత్రం, "వినియోగదారులు కోరుకున్న విధంగా కొత్త రంగులతో, కొత్త డిజైన్లతో, నాణ్యమైన వస్త్రాలు నేయడం". ఇందులో, ప్రాథమిక సహకార సంఘం ఒక గుడి. ఆ గుడిలో పూజారి చేనేత కార్మికుడు.

ఈ దేశ సామాజిక ఆర్థిక అభివృద్ధిలో, ప్రభుత్వ సహకారంతో, వినియోగదారుల మద్దతుతో, ఈ ఆరాధన (చేనేత పని వల్ల) తన వంతు పాత్ర నిర్వహిస్తుంది అని ఆశిద్దాం.

(డా. ఎస్. కే. పాండ, IAS, పూర్వ చేనేత సంచాలకులు, ఒడిశా, రచించిన పుస్తకం, "చేనేత సోదర సోదరీమణులకు ఒక మాట", జనవరి, 1994 నుంచి)





## చేనేత కార్మిక సోదర సోదరీమణుల ఆదాయ పెంపు గురించి కొన్ని ఆలోచనలు[1]...

ఆహారం తరువాత, మానవులకు అత్యంత అవసరం అయినది వస్త్రం. మానవులు ధరించే వస్త్రాలు అనేక దశాబ్దాలలో రూపాంతరం చెందింది. తొలుత, చెట్లు, జంతువుల నుంచి సేకరించిన నూలుతో చేతి మగ్గాల ద్వార వస్త్రాలు నేసేవారు. పారిశ్రామిక విప్లవం, తరువాత సాంకేతిక అభివృద్ధి, ఫ్యాషన్ వల్ల వస్త్రాల వైవిద్యం, రూపం మరియు తయారిలో అనేక మార్పులు వచ్చినాయి. అయినా కూడా, చేనేత వస్త్రాలు భారత సంస్కృతికి, వారసత్వ సంపదకు ప్రతీకలుగా కనపడుతూనే ఉన్నాయి. రంగులు, డిజైన్ మరియు నైపుణ్యం కలపోసిన చేనేత వస్త్రాలకు దేశ విదేశాలలో ప్రశంసకులు పెరుగుతూనే ఉన్నారు. వీటి ప్రాశస్త్యం ఎంతగా ఉండేది అంటే, బ్రిటీష్ వారు మొదట మన దేశానికి వచ్చినప్పుడు వీటిని చూసి కన్ను కుట్టి, చేనేత పరిశ్రమను నాశనము చేయ పూనుకున్నారు.

పవర్లూం రావడంతో చేనేతకు గట్టి పోటి ఎదురయ్యింది. కొన్ని స్పష్టమైన కారణాల వల్ల, చేనేత మగ్గం మీద నేసిన సాధారణ వస్త్రం కంటే పవర్లూం మీద నేసిన వస్త్రం తక్కువ ధరకు వస్తుంది. ధర తక్కువ కావడం వలన సాధారణ ప్రజలు పవర్లూం వస్త్రాన్నే ఎంచుకుంటారు. స్వాతంత్ర్యం తరువాత, చేనేత కుటుంబాల కొరకు అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టటం జరిగింది. కొన్ని రకాలు చేనేత మగ్గం మీద మాత్రమె ఉత్పత్తి కొరకు రిజర్వేషన్ చేయబడ్డాయి. అయినా కూడా, ధర తక్కువ కావడం

---

[1] డాక్టర్ సంజయ కుమార్ పాండా ఐఏఎస్,
ఒక ప్రజా సేవకుడు ప్రస్తుతం జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వం.
వ్యక్తపరచిన భావనలు వ్యక్తిగతమైనవి. E mail: sanjaypanda@gmail.com (10 మే 2015)

వల్ల, పవర్లూం వస్త్రాలు మార్కెట్లో సింహ భాగం ఆక్రమించాయి. పవర్లూం మరియు మిల్లుల ఉత్పత్తిలో సాంకేతిక అభివృద్ధి జరిగినా, చేనేత వస్త్రాలు తమ ఉనికిని, ప్రత్యేకతను కోల్పోలేదు.

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, మహాత్మా గాంధీ భారత దేశంలో చేతితో వడికిన, దాంతో నేసిన చేనేత వస్త్రాల ధారణ ఆవశ్యకత గురించి గట్టిగా చెప్పేవారు. స్వతంత్రం కోసం జరుపుతున్న పోరాటాలలో స్వదేశీ ఉద్యమం ఒక అంతర్భాగంగా ఎదిగింది. కాగ, 21వ శతాబ్దంలో పరిస్థితి మారింది. భారత జౌళి పరిశ్రమ అంతర్జాతీయ జౌళి రంగంలో ఒక విశిష్ట స్థానం సంపాదించింది. మొత్తం ప్రపంచం భారత స్పిన్నింగ్, నేత, దుస్తులు, ఫ్యాషన్ రంగాలతో కూడిన ఆధునిక జౌళి పరిశ్రమ వైపు దృష్టి సారించింది. చేనేత, పవర్లూం, మిల్లు రంగాల ఉనికిని, అభివృద్ధిని కాదనలేని పరిస్థితులలో, చేనేత పరిశ్రమ గట్టి పడి, నిలదొక్కుకోవాల్సిన పరిస్థితి కనపడుతుంది. ఎటువంటి వస్త్రం కొనాలి అనే నిర్ణయం వినియోగాదారునిదే. వారు సాధారణంగా నాణ్యత, మన్నిక, ధర ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంటారు. చేనేత పారిశ్రామికులు ఈ వాస్తవాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా తయారు కావాలి.

ప్రత్యక్షంగా, చేనేత పరిశ్రమ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, తక్కువ పెట్టుబడితో, మంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ తో, వారసత్వ సంపదను కాపాడుతూ, భారత సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ, పరోక్షంగా తక్కువ ఇంధన వనరులను ఉపయోగించి, కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ వనరులను కాపాడుతూ, పట్టణాలకు గ్రామీణ వలసలను నిరోధిస్తూ, పట్టణీకరణ వృద్ధిని తగ్గిస్తూ, తన వంతు



పాత్ర నిర్వహిస్తున్నది. సామాజికపరంగా, చేనేత పరిశ్రమ మహిళా సాధికారతకు అవకాశం కల్పిస్తూ, SC, ST మరియు మైనారిటి బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అలవాలమయి అందరిని కలుపుకునిపోయే అభివృద్ధి మరియు సుస్థిరత సాధించే పయనంలో తన వంతు పాత్ర పోషిస్తున్నది.

వైవిధ్యత మరియు డిజైన్ లను ఎప్పటికప్పుడు మార్చుకోగలిగే సత్తా చేనేత యొక్క ప్రధాన బలం. కేవలం ఒక పోగు రంగు మార్చడం ద్వార లేక నేత మార్చడం ద్వార ఒక దానికి ఒకటి పొంతన లేకుండా వైవిధ్యబరితమైన వస్త్రాలు చేనేత పరిశ్రమకు మాత్రమే సాధ్యం. అదే పవర్లూం మీద నేసిన వస్త్రం మీటర్లకు మీటర్లు ఒకటే విధంగా ఉంటుంది. రంగు మరియు డిజైన్ తో పాటు, చేతితో నేయడం వల్ల చేనేత వస్త్రం జాతీయ అంతర్జాతీయ మార్కెట్లో విశిష్టతను సంపాదించింది. బనారస్, జమ్దాని, కాంచీపురం లేదా ఒడిశా ఇక్కత్ చీర ధరించిన మహిళ ప్రపంచంలో ఎక్కడైనా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది, ఆ వస్త్రాలకు ఉన్న ప్రాశస్త్యం వల్ల. చేనేత వస్త్రం ధరించిన వ్యక్తికి గుర్తింపు వస్తుంది, పరిపూర్ణత వస్తుంది. నలుగురిలో ప్రత్యేకత వస్తుంది. గర్వించదగిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితులలో, నాణ్యత మీద దృష్టి పెట్టి, ఎప్పటికప్పుడు డిజైన్ లు మారుస్తూ, ఎక్కువ ధర పెట్టగలిగే వినియోగదారుల అవసరాలు తీర్చడం ద్వార చేనేత పరిశ్రమ మార్కెట్ పోటిలో నిలదొక్కుకునే అవకాశం ఉంది. తక్కువ ఖరీదు చేసే చేనేత వస్త్రాలకు ఎట్లాగు దేశీయ వినియోగం మరియు స్థానిక మార్కెట్లలో స్థానం ఉంటుంది. కాని, మార్కెట్ చేరిన వెంటనే చేనేత వస్త్రం పవర్లూం వస్త్రం

నుంచి పోటి ఎదుర్కుంటుంది. సాధారణ, డిజైన్ లేని వస్త్రం చేనేత మగ్గం మీద నేసిందా లేక పవర్లూం మీద నేసిందా అని ఒక సగటు కొనుగోలుదారుడు చెప్పలేరు. రెండింటి మధ్య తేడా గుర్తించడం కష్టం. అందరు గుర్తించలేరు.

అందుకని, చేనేత పరిశ్రమ పునః-వైభవం సాధించాలంటే మంచి, సరి కొత్త డిజైన్ లతో, నాణ్యత కలిగిన, నైపుణ్యం కలగలిపిన చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేసి, ప్రత్యేక మార్కెట్లలో ధర పెట్టి కొనగలిగే కొనుగోలుదారుల కనుగుణంగా ఉత్పత్తి చేయాలి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి, ప్రత్యేకంగా చేనేత కుటుంబాల ఆదాయం పెరగడానికి, వారి జీవన ప్రమాణాలు పెంచడానికి అనేక చర్యలు చేపడుతున్నాయి. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు: చట్టపర రక్షణ మరియు ప్రోత్సాహకాలు. చట్టపరంగా రక్షణ కొన్ని రకాల వస్త్రాలు చేనేత మగ్గం మీద మాత్రమే ఉత్పత్తి చేసే విధంగా రిజర్వేషన్ మరియు నూలు సరఫరా కొరకు స్పిన్నింగ్ మిల్లుల మీద చిలపల నూలు ఉత్పత్తి భాద్యత. ప్రోత్సాహక చర్యలలో చేనేత కుటుంబాలకు మేలు చేకూర్చే కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధిపత్యంలో చేనేత అభివృద్ధి సంచాలకులు మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న అనేక ప్రణాళికలు మరియు కార్యక్రమాలు ఉన్నాయి.

ప్రభుత్వం ఇప్పుడు చేపట్టిన కార్యక్రమాలు మరియు పథకాలను సమీక్షించి, బలోపేతం చేసి అనుకున్న లక్ష్యాలు సాధించాలి. మొత్తం భారత జౌళి పరిశ్రమ ఒక సమగ్ర ఆలోచనతో, రిజర్వేషన్ ద్వార కల్పించిన



చేనేత వస్త్రాలకు రక్షణ బలోపేతం చేసి, చేనేత కుటుంబాల ప్రయోజనాలు మార్కెట్లో దెబ్బ తినకుండా చూడాలి. అట్లాగే, చేనేత పరిశ్రమకు అవసరమైన నూలు సరఫరా నిరంతరంగా, తక్కువ ధరకు జరగటానికి, స్పిన్నింగ్ మిల్లు మీద పెట్టిన చిలపల నూలు భాద్యతను పరిపుష్టం చేసి, సక్రమంగా అమలు అయ్యేలా చూడాలి.

కేంద్ర చేనేత అభివృద్ధి సంచాలకుల ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న 27 వీవర్ సర్వీస్ సెంటర్లు డిజైన్, రంగుల అద్దకం మరియు నేత మీద కొత్త ఉత్పత్తులు చేయడానికి చేనేత కార్మికులకు సాంకేతిక సహాయం అందిస్తున్నాయి. ఇదిగాక, వారణాసి, గౌహతి, జోధ్పూర్, సేలం, బర్గడ్ మరియు శాంతిపూర్ లో పెట్టిన భారత చేనేత సాంకేతిక కళాశాలలు డిప్లోమా కోర్సుల, శిక్షణ ద్వార చేనేతలో మానవ వనరులను పెంపొందిస్తున్నారు. ఇప్పటి అవసరాలకు అనుగుణంగా, ఈ శిక్షణలో ఫాషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అకౌంటింగ్, మేనేజ్మెంట్ తదితర అంశాలను జోడించి శిక్షణలో మార్పులు తీసుకు వస్తున్నారు.

చేనేత అభివృద్ధికి కొరకు అవలంబించిన ప్రాథమిక వ్యూహంలో స్వతంత్ర చేనేత కార్మికులను ఒక ప్రాథమిక సహకార సంఘంలో చేర్చి, ఉత్పత్తికి సహకారం అందించి, ఆయా ఉత్పత్తులు మార్కెట్లో అమ్ముకునే విధంగా చేయడం. ప్రాథమిక చేనేత సహకార సంఘులన్నింటిని ఒక రాష్ట్ర స్థాయి సహకార సంస్థ ద్వార ఏకీకృతం చేశారు. సహకారేతర చేనేత కార్మికుల సహాయార్థం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత అభివృద్ధి కార్పొరేషన్లు ఏర్పాటు చేసాయి. చేనేత ఉత్పత్తులు అనేక ప్రైవేటు సంస్థలు మరియు కళలు మరియు కళా నైపుణ్యాలను ప్రోత్సహించే సంస్థలు కూడా

అమ్మకాలు జరుపుతున్నాయి. స్వాతంత్ర్యం తరువాత కేంద్రీయ చేనేత సహకార సంఘాలు మరియు చేనేత అభివృద్ధి కార్పొరేషన్లు కూడా చేనేత అభివృద్ధిలో ఒక మంచి పాత్ర పోషించాయి. కాగ, ఈ సంస్థలు కొన్ని సంవత్సరాల తరువాత అధిక నెలవారి ఖర్చులు, వేతనాలతో ఆర్థిక భారం పెరిగిపోయి కుదేలు అయినాయి. చేవలుడిగినాయి. ఇంకొక ప్రక్క, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యాప్తి వలన సమాచార విప్లవం వచ్చింది, దూర ప్రదేశాలు దగ్గర అయినాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారంగా రూపొందించిన 'ప్రధాన మంత్రి జన ధన యోజన' పేద ప్రజల సాధికారతకు అవసరమైన సంస్థాగత ఆర్థిక వనరులు కల్పించే లక్ష్యం ఒక వినూత్న పథకానికి నాంది అయింది. చేనేత కార్మికులు కుటుంబాలు ముందుకు వచ్చి, ఈ పథకం అందించే అవకాశాలను ఉపయోగించుకుని, సంస్థాగత రుణాలు అందుకుని, మార్కెట్లో తమ ఉనికిని చాటుకోవచ్చు.

చేనేత మగ్గం ఉన్న ప్రతి యొక్క చేనేత కార్మికుడు ఒక కమర్షియల్ ఉత్పత్తి కేంద్రం అయిన కూడా, కనీసం 100 మంది ఒక దగ్గరికి వచ్చి మార్కెట్ తో అనుసంధానం చేసుకుంటూ, అవసరమైనన్ని మీటర్ల మేర వస్త్ర ఉత్పత్తి చేసి, సరి అయిన నాణ్యత తో, సరి అయిన సమయానికి, నిరంతరంగా ఎప్పటికప్పుడు తమ జీవనోపాధి కొనసాగించవలసిన ఆవశ్యకత ఎంతైన ఉంది. చేనేత పరిశ్రమ మార్కెట్ కు అనుగుణంగా, అధిక విలువ కలిగిన, ఫాషన్ ప్రకారం వస్త్ర ఉత్పత్తి చేయడానికి ఈ విధంగా ఐక్యత సాధించడం చాల ముఖ్యం. ఈ పరిస్థితి దృష్ట్యా, చేనేత కొనసాగే అవకాశం ఉన్న క్లస్టర్ లో, చేనేత అభివృద్ధికి ఒక సరి కొత్త వ్యూహ రచన చేయాలి. ఒక ప్రదేశంలో, చేనేత కుటుంబాలు సంఖ్య ఎక్కువగా ఉంటే, ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు



ఏర్పాటు చేయవచ్చు. దానికి తగిన వ్యాపారం చేయవచ్చు, వేతన మరియు ఇతర ఖర్చులు భరించవచ్చు.

ఈ దృష్టికోణంతో, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి ఒక్కొక్క బ్లాకులో అందరి ఉపయోగానికి ఒక కామన్ వసతుల/సదుపాయాల కేంద్రం (Common Facility Centre) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ప్రతి కేంద్రంలో ముడి సరుకు మరియు చేనేత వస్త్ర ఉత్పత్తుల నిలువకు గోదాములు, మరియు ఒక ఆఫీస్ ఉంటుంది. ఈ ఆఫీస్ ఇంటర్నెట్ సదుపాయాలతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరికరాలతో ప్రధాన మంత్రి జన ధన యోజన వంటి పథకాలు అందుకునే ఏర్పాట్లు ఉంటాయి. ఈ కేంద్రంలో డిజైనర్ లేదా పెద్ద కొనుగోలుదారులు ఒకటి రెండు రోజులు అవసరమైతే ఉండడానికి వసతి ఏర్పాట్లు కూడా ఉంటాయి. డిజైన్, రంగుల అద్దకం మరియు నేత నైపుణ్యం లో శిక్షణ ఏర్పాట్లు కూడా ఉంటాయి. ఇవి గాక, డిజైన్ కు మరియు రంగుల అద్దకానికి, నీటి శుద్ధికి, నేసిన వస్త్రాలను ప్రోసెస్ చేయడానికి కూడా తగిన పరికరాలు ఏర్పాటు చేయబడతాయి. ఈ కేంద్రం వసతులు ప్రస్తుతం మంచి నిర్వహణలో ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘానికి ఇదివరకే ఉన్న సదుపాయాలను బలోపేతం చేసే విధంగా లేదా అదనంగా ఏర్పాటు చేయబడుతుంది. ఎక్కడయితే ప్రాథమిక చేనేత సహకార సంఘం లేనప్పుడు, అక్కడ గ్రామ పంచాయతి లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా ఎవరైనా దాత ఇచ్చే స్థలంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయబడుతుంది. అటువంటి కేంద్రం నిర్వహణ భాధ్యత స్థానికంగా రిజిస్టర్ అయిన స్వయం సహాయక బృందాలకు కాని లేదా చేనేత కుటుంబాలకు సంబంధించిన ఏదేని సంస్థకు

కాని ఇవ్వబడుతుంది. ఈ సాధారణ వసతుల కేంద్రం లో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఒక డిప్లొమా చదివిన వ్యక్తి తో పాటు పాలనా భాద్యతలు గల ఒక విశ్రాంత మిలిటరీ ఉద్యోగి కూడ విధులు నిర్వర్తిస్తారు. వీవర్ సర్విస్ సెంటర్ కు మరియు చేనేతకు సంబందించిన రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక ఉన్నత అధికారులు ఈ వసతుల కేంద్రానికి సాంకేతిక సహకారం అందిస్తారు.

తరాలుగా, మాస్టర్ వీవర్లు తమ వ్యాపార సంస్థల ద్వార చేనేత వ్యాపారం చేస్తూ, చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే వీరు లాభాల్లో సింహ భాగం తమ దగ్గర ఉంచుకుని, కేవలం చిన్న మొత్తం కష్టపడి నేసె చేనేత కార్మికులకు ఇస్తున్నారు అని అనేక అధ్యయనాల ద్వార తేలింది. దీనిని ఎదుర్కోవాలంటే, ప్రతి కష్టపడి నేసె చేనేత కార్మికుడు ముందుకు వచ్చి, ప్రభుత్వ సహాయం తీస్కుని తన సొంత ఇంట్లో సొంత మగ్గం ఇతర పరికరాల వసతులు కల్పించుకోవాలి. దీని వలన, సగటు చేనేతకారునికి స్వతంత్రంగా ఎవరితో నైన పని ఎన్నుకోవడానికి, చేనేత వ్యాపారస్తునితో కాని ప్రాథమిక చేనేత సహకార సంఘంతో కాని, స్వయంగా కాని, వస్త్ర ఉత్పత్తి చేసి, అమ్ముకునే అవకాశం వస్తుంది.

చేనేత పని ఇంటిలో ఉండి చేయగలిగే జీవనోపాధి. ఈ పనిలో మహిళలు భాగస్వాములు కావడానికి అవకాశం ఉంది. ఇంటి పని, పిల్లలు మరియు ముదుసలుల బాగోగులు చూసుకుంటూ, మహిళలు చేనేత పనిలో పాలు పంచుకుంటున్నారు. అటువంటి మహిళలు కూడా ప్రభుత్వ సహాయంతో శిక్షణ తీసుకోవచ్చు, మగ్గం ఏర్పాటు చేసుకోవచ్చు, ఇతర సాధనాలు తెచ్చుకోవచ్చు, వస్త్ర ఉత్పత్తి కూడా చేపట్టవచ్చు. ఇది ఖచ్చితంగా



మహిళా సాధికారతకు దారి తీస్తుంది. వారికి చేనేత ద్వార మంచి ఆదాయం కూడ వస్తుంది.

అవసరం మేరకు, వర్క్ షెడ్ నిర్మాణం కొరకు, కొత్త మగ్గం కొనడానికి, ఇతర సాధన సామాగ్రి కొనుగోలుకు ఇప్పుడున్న పథకాల ద్వార సహాయం పొందవచ్చు. ఇప్పుడున్న సదుపాయాలు బలోపేతం చేసుకోవచ్చు, లేదా కొత్తగా సమకూర్చుకోవచ్చు. అటువంటి సహాయం నేరుగా చేనేత కార్మికుని బ్యాంకు అకౌంట్లో జమ చేయబడుతుంది. వచ్చిన నిధులతో, తన సొంత నిర్ణయం, ఆలోచన మేరకు, సాంకేతిక అధికారుల సహాయంతో, ఆయా పరికరాలు, వసతులు, సదుపాయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. చేనేత కుటుంబాల ఆరోగ్యం కొరకు, ఇప్పుడున్న చేనేత సంక్షేమ పథకాన్ని రాష్ట్రీయ స్వస్థ్య భీమ యోజన (RSBY) తరహాగా మార్చుతున్నారు. ఈ పథకం అమలు భాద్యత కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ చేపడుతుంది. ఈ శాఖను చేనేత కుటుంబాలకు అవసరమైన ఆరోగ్య వసతుల కల్పనకు సంబంధించి వివరాలు తయారు చేయమని కోరడమైనది. అదనంగా, 9 మే, 2015, నాడు ప్రారంబించిన ప్రధాన మంత్రి సురక్ష భీమ యోజన మరియు ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమ యోజన పథకాల క్రింద చనిపోయిన లేదా ఏదేని వైకల్యం వచ్చిన రూ.2 లక్షల వరకు భీమ సహాయం చేనేత కార్మికులు పొందవచ్చు.

రుణ సౌకర్యం చాల ముఖ్యమైన అవసరం చేనేత కుటుంబాలకు. సహకార సంఘాల ద్వార లేదా సహకార బ్యాంకుల ద్వార ఈ సౌకర్యం కల్పించబడుతున్నది. కేంద్ర ప్రభుత్వం, నాబార్డ్ మరియు రాష్ట ప్రభుత్వాల సహకారంతో, ఉత్పత్తి పెట్టుబడి తక్కువ వడ్డితో అందించటం ద్వార చేనేత

సహకార సంఘాల పునరుద్ధరణ పథకం చేపట్టింది. ఈ పథకం విజయవంతమైన అమలు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. సహకరేతర రంగంలో ఉన్న చేనేతకారులకు, కమర్షియల్ బ్యాంకుల నుండి ఋణం పొందుటకు వీవర్స్ క్రెడిట్ కార్డు ఇవ్వడం జరిగింది. చేనేత కార్మికుడు అప్పు తెచ్చుకోవటానికి మార్జిన్ మని సహాయం కూడా ఇస్తున్నారు. ప్రధాన మంత్రి జన ధన యోజన లో భాగంగా బ్యాంకు అకౌంట్ తెరిచి ఇతర ప్రయోజనాలతో పాటు, చేనేత కార్మికులు నేరుగా ఇంటర్నెట్ సదుపాయం ద్వార ఋణ సౌకర్యం కూడా పొందవచ్చు. మంచి నాణ్యత తో, మన్నికైన చేనేత వస్త్ర ఉత్పత్తి చేసి, మార్కెట్లో అమ్ముకుని, అప్పు కట్టి, తిరిగి ఋణం పొందవచ్చు. ఆ విధంగా నిరంతరంగా, ఏండ్ల కొద్ది, ఎప్పటికి చేనేత కార్మికుడు ఋణ సౌకర్యం తీసుకోవచ్చు.

సమీకృత చేనేత అభివృద్ధికి, నిరంతర సమాచారం ఎంతైన అవసరం. మూడవ చేనేత జనాభా గణన 2010లో చేయబడింది. అయితే, సేకరించిన సమాచారం సరిపోదు. ఇందులో, సమాచార సేకరణ పెంచుకోవాలి. (i). చేనేత కుటుంబం వివరాలు – కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ సంఖ్య, బ్యాంకు అకౌంట్ నెంబర్, తదితర, (ii) ఆర్థిక స్థితికి, పేదరికం సంబంధించిన పత్రాలు, (iii) ఉత్పత్తి వివరాలు – నేసే రకం, నైపుణ్యం, తదితర వివరాలు. ఇటువంటి వివరాలు సేకరించే ప్రక్రియ మొదలయ్యింది. త్వరలోనే, వెబ్ సైట్ లో పెట్టడం జరుగుతుంది. ఇటువంటి సమాచారం పెద్ద కొనుగోలుదారులకు, ఎగుమతిదారులకు, ఫాషన్ దుస్తుల తయరిదారులకు ఉపయోగపడుతుంది. ఇటువంటి సమాచార కేంద్రం వలన, కొనుగోలుదారులు నేరుగా నేసే చేనేత కార్మికులను సంప్రదించే అవకాశం వస్తుంది. ఇటువంటి సాంకేతిక పరిణామాలను, అవకాశాలను



ఉపయోగించుకునేందుకు, చేనేత కుటుంబాలూ ముందుకు రావాలి.

గత రెండు మూడు దశాబ్దాలలో చేనేత కుటుంబాలలో చదువుకున్న వారి సంఖ్య పెరుగుతుంది. డిగ్రీ లేదా ఉన్నత చదువులు పూర్తి చేసిన వారి సంఖ్య కనపడుతుంది. చేనేత కుటుంబంలో చదువుకున్న యువత చేనేత ఉత్పత్తి, అమ్మకాలు చేస్తూ చేనేత వ్యాపారవేత్తగా ఎదగవచ్చు. ఎక్కువ మంది చేనేత కుటుంబాలూ వెనుకబడిన కులాలు, నిమ్న కులాలు, మైనారిటీ వర్గాలకు చెందినవారు కనుక, ఇందులోని యువత ఆయా వర్గాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలు లేదా కార్పొరేషన్ల ద్వార తక్కువ వడ్డీకి ఋణ సౌకర్యం పొందవచ్చు. ఈ కార్పొరేషన్లు దాదాపు రూ.10 లక్షల సులభ ఋణ సౌకర్యం ఇచ్చే ఏర్పాట్లు ఉన్నాయి. కమర్షియల్ బ్యాంకులు కూడా ఆయా వర్గాల సంకేతం కొరకు ఏర్పాటు చేసిన సంస్థల రుణాలు అందిస్తున్నాయి. ఈ పథకాలను, ఆయా వర్గాలకు చెందిన చేనేత కుటుంబాల యువత ఉపయోగించుకోవచ్చు.

ప్రత్తి లేదా సిల్కు నూలు, రంగులు, రసాయనాలు, చేనేత మగ్గం, ఇతర పరికరాల లభ్యత కూడా నాణ్యమైన చేనేత ఉత్పత్తికి అత్యంత అవసరం. అవి లభించకపోయినా, అధిక ధరలు ఉన్న చేనేత కుటుంబాలకు సమస్య. చేనేతకు అవసరమైన చిలపల నూలు ఉత్పత్తి చేసే భాద్యత ప్రతి స్పిన్నింగ్ మిల్లు మీద చట్టపరంగా ఉంది. లక్నో కేంద్రంగా ఎన్.హెచ్.డి.సి. ని ఏర్పాటు చేసి చేనేత పరిశ్రమకు అవసరమైన నూలు, రంగులు, రసాయనాలు సరి అయిన ధరకు, సరి అయిన సమయానికి అందించే భాద్యత ఈ సంస్థ మీద పెట్టటం జరిగింది. మిల్ గేటు ప్రైస్ పథకం మరియు రిబేట్ ద్వార ఈ

కార్యక్రమం జరుగుతున్నది. ఎన్.హెచ్.డి.సి. అన్ని రాష్ట్రాలలో తన బ్రాంచీల ద్వార ఈ సహకారం అందిస్తున్నది. ఆయా బ్రాంచీలు సంబందిత వీవర్ సర్వీస్ సెంటర్ ప్రక్కనే పెట్టుకుని చేనేత కుటుంబాలకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా ఎన్.హెచ్.డి.సి.కి సలహా ఇచ్చారు కూడా. ఒక్కక చేనేత క్లస్టర్కు ఉత్పత్తి ప్రణాళిక తయారు చేసి, ప్రతి మూడు నెలలకు ముడి వస్తువులు అవసరం అవుతాయో ఇందులో వివరించి, ఎన్.హెచ్.డి.సి. కి ముందస్తుగానే పంపాలని ప్రతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమయినది. అట్లాగే, ఎన్.హెచ్.డి.సి. ని కూడా ఈ ప్రణాళికలకు అనుగుణంగా ఆయా చేనేత క్లస్టర్లలో అవసరమైన నూలు, మరియు రంగుల నిలువలు సరి అయిన ధరకు, సరి అయిన సమయంలో అందుబాటులో ఉంచాలని ఆదేశాలివ్వడం కూడా జరిగింది.

రంగుల అద్దకం, నేత నైపుణ్యం, డిజైన్ మరియు కొత్త చేనేత రకాల ఉత్పత్తి నైపుణ్య శిక్షణలు అత్యంత అవసరం. వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక అధికారులతో కలిసి, ఈ శిఖనలు అందించే భాద్యత తీసుకుంది. అట్లాగే, ఎన్.హెచ్.డి.సి. కూడా వికేంద్రిక్రుత రంగుల అద్దకం శిక్షణలు కామన్ వసతుల కేంద్రం మరియు వీవర్స్ సర్వీస్ సెంటర్ ద్వార చెపట్టాలని చెప్పటం జరిగింది.

నైపుణ్యం గల చేనేతకారులను ప్రోత్సహించటానికి జాతీయ అవార్డు మరియు సంత్ కబీర్ అవార్డ్ ప్రతి యేట ఇస్తున్నారు. ఈ గుర్తింపు వలన చేనేతకారులకు నైపుణ్యం, ఉత్సాహం పెరుగుతుంది. తద్వారా చేనేత రంగం కూడా ప్రయోజనం పొందుతుంది.



గౌరవ ప్రధాన మంత్రి గారి సలహా మేరకు చేనేతను ఫ్యాషన్ రంగంతో జత కలిపే చర్యలు చేపట్టటం జరిగింది. 15 పట్టణాలలో ఉన్న జాతీయ ఫ్యాషన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో చదువుతున్న విద్యార్థులు, ఉపాద్యాయులు చేనేత కార్మికులతో కలిసి ఫ్యాషన్ పరిశ్రమకు అవసరమైన్ నూతన డిజైన్ ల మీద కృషి చేయమని కోరడమయినది. చేనేతను ఫ్యాషన్ తో కలిపి ప్రోత్సహించే విషయం మీద ఒక జాతీయ వర్క్ షాప్, 22 జనవరి, 2015, నాడు భువనేశ్వర్ పట్టణంలో నిర్వహిస్తే, చాల ఉత్సాహం చేనేత వర్గాలలో, విద్యార్థులలో మరియు ఉపాధ్యాయులలో కనపడింది. చేనేత, చేతి వృత్తుల తో టూరిజం ప్రోత్సహించే దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. దీని వలన చేనేత ఉత్పత్తుల మార్కెట్ పెరిగి, అమ్మకాలు పెరిగి, చేనేత ఉపాధి పెరిగే అవకాశం ఉంది.

చేనేత పునరుజ్జీవనం ప్రయత్నాలలో చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకం చాల ముఖ్యమయినది. ఇదివరకు చెప్పినట్టుగా, చేనేత తన నేత, విశిష్టత, గుర్తింపు, రంగుల మేళవింపు, డిజైన్, నాణ్యత ద్వార మాత్రమే మర మగ్గం వస్త్రంతో పోటి పడగలదు. దానికి కనుగుణంగానే, చేనేత ఉత్పత్తి ప్రణాళిక తయారు కావాలి. మార్కెట్ పరిస్థితులను బట్టి ఉత్పత్తి ప్రణాళిక మారుతూ ఉండాలి. ప్రతి చేనేతకారుడు ఒక కళాకారుడు, డిజైనర్ కనుక, మార్కెటింగ్ చేసేవారి సహకారంతో చేనేతకున్న గుర్తింపును ఉపయోగించుకుని, ఉత్పత్తి పెంచుకుంది, అమ్మకాలు పెంచుకోవాలి.

ఈ మధ్య గుడ్ అర్త్, బిబా, తుల్సి, సౌత్ హ్యాండ్ లూమ్స్, సుందరి సిల్క్స్, ఆర్గండి సిల్క్స్, వంటి అనేక ప్రైవేటు చేనేత వ్యాపార సంస్థలు సాంప్రదాయ చేనేత వస్త్రాల అమ్మకాల ద్వార ఎదిగినాయి. వాటి విజయం వెనుక చేనేత

ఉత్పత్తికి, ప్రత్యేక మార్కెట్లలో ఉన్న విశిష్టత ఉన్నది అనేది సత్యం. అటువంటి ప్రైవేట్ వ్యాపారస్తులను మార్కెట్ డిమాండ్ కు అనుగుణమైన డిజైన్ అభివృద్ధి చేసి, చేనేతకారులకు సహాయం అందించి కొత్త డిజైన్ ల ఆధారంగా చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేయమని ప్రోత్సహిస్తున్నాం. అటువంటి ప్రయత్నాల ద్వార మార్కెట్లో కొత్త భాగస్వామ్యాలను ప్రోత్సహించి, డిజైన్ అభివృద్ధికి దోహదపడే చర్యలు చేపట్టటం జరిగింది.

ఈ-కామర్స్ ద్వార కూడా చేనేత వస్త్రాల మార్కెటింగ్ పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. m / s. ఫ్లిప్ కార్ట్ అనే సంస్థతో చేనేత వస్త్రాల మార్కెటింగ్ కొరకు ఒక అవగాహనా ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా, చేనేతకారుల వస్త్రాలు ఆ సంస్థ తన వెబ్ సైట్ ద్వార నేరుగా వినియోగదారులకు అందిస్తుంది. ఈ ప్రయత్నం ఇంకా మెరుగుపరచాల్సి ఉంది. ఈ ప్రయత్నం కొనసాగితే చేనేతకారులకు వేతనాలు పెరుగుతాయి, మధ్యవర్తుల బాధ తప్పుతుంది, మార్కెట్ గురించిన సమాచారం నేరుగా నేసేవానికి ఎప్పటికప్పుడు నిరంతరంగా చేరుతుంది.

కొనుగోలుదారులకు చేనేత వస్త్రం నాణ్యత మీద నమ్మకం పెంచటానికి ఒక ప్రత్యేక బ్రాండ్, "ఇండియా హ్యాండ్ లూం" అని అభివృద్ధి చేస్తున్నారు. ఈ బ్రాండ్ వలన నాణ్యత మీద నమ్మకం పెరుగుతుంది, డిజైన్ స్వచ్ఛత ఉంటుంది, వినియోగదారులు తాము పెట్టిన పెట్టుబడి సరి అయిన విధంగా ఉపయోగపడింది అనే భావన కలిగిస్తుంది. ఈ బ్రాండింగ్ ఉండాలంటే "సున్నా లోపం, సున్నా ప్రభావం" తో ఉత్పత్తి, ప్రమాదకర క్యాన్సర్ కారక అజో రంగులు మరియు రసాయనాలు వాడకుండా, వ్యర్థ



జలాల శుద్ధి చేసి పర్యావరణ అనుకూలత సాధించడం; మరియు చైల్డ్ లేబర్ లేకుండా సామాజిక అనుకూలత సాధించడం. ఈ ఆలోచనను "mygov.in" అనే వెబ్ సైట్ లో పెట్టినప్పుడు అనేక సూచనలు వచ్చాయి. వాటిని పొందుపరుస్తూ, ఈ బ్రాండు మార్గదర్శకాలను తయారు చేస్తున్నారు.

గౌరవ ప్రధాన మంత్రి మొదలు పెట్టిన "Make in India" నినాదం, మరియు కార్యక్రమం చేనేత పరిశ్రమ ప్రోత్సాహానికి మంచి అవకాశం కల్పిస్తుంది. చేనేత కుటుంబాలలో చదువుకున్న యువత ముందుకు వచ్చి చేనేత వ్యాపారస్తులుగా ఎదిగే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. సాంకేతిక విజ్ఞానంతో, కొత్త మార్కెట్లను అన్వేషిస్తూ, చేనేత ఉత్పత్తిని పెంచుతూ, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలి.

చేనేత పరిశ్రమ ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం. ఈ దిశగా, అనేక మీటింగ్ లలో, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వార, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్పత్తి ప్రణాళిక తయారు చేయమని, చేనేతకారులకు అవసరమైన ముడిసరుకుకు (నూలు, రంగులు, మగ్గం, ఇంకా ఇతర పరికరాలు) సంబంధించిన సహాయం అందించమని, కేంద్ర మార్కెట్ పథకాలకు అవసరమైన సాంకేతిక సహాయం అందించమని, అదనంగా తమ వనరుల ద్వార ఇతర సహాయ కార్యక్రమాలు చేపట్టమని సూచించటం జరిగింది. అదనంగా, ప్రైవేటు వ్యాపారవేత్తలు, ఫ్యాషన్ డిజైనర్ లకు కూడా ఉత్పత్తి పెంచి, మార్కెటింగ్ విస్తృతపరిచి, తద్వారా చేనేత పరిశ్రమను ప్రోత్సహించమని కోరటం జరిగింది.

మన దేశ సంస్కృతి, వారసత్వ సంపద, సంప్రదాయాలలో చేనేత వస్త్రాలు, చేనేత కుటుంబాలకు విడదీయరాని స్థానం ఉంది. ఒకవైపు వారికి అన్ని రకాల సహాయం అందించే ప్రయత్నాలు చేస్తున్నా, చేనేత కుటుంబాలకు చెందిన సోదర సోదరీమణులు, తమ వృత్తి మీద, సంఘానికి తాము చేస్తున్న సేవల మీద గర్వపడుతూ, అనేక రకాల సహాయం అందుకోవడానికి ముందుకు వచ్చి మార్కెట్ అవసరాల కనుగుణంగా కొత్త వస్త్రాలు ఉత్పత్తి చేయాలి. దీని వలన వారి ఆదాయం పెరుగుతుంది, గౌరవంతో మంచి జీవితం గడిపే అవకాశం తీసుకుని, ప్రపంచ జౌళి రంగంలో భారత చేనేతకు ఉన్న విశిష్టతను నిరంతరంగా కొనసాగే పరిస్థితి వస్తుంది అనేది నిర్వివాదాంశం.